# 9

# సిలువ మరియు సంఘము

“పాపులను రక్షించుటలో సిలువలేని క్రీస్తు ఎలా శక్తిహీనుడైయుంటాడో, అలాగే క్రీస్తులేని సిలువయు ఉంటుంది”; క్రీస్తు ప్రభువు మానవ పాప (రుణాన్ని) చెల్లించాడన్న క్రొత్త నిబంధన భావనతో పరిచయమున్నవారు ఈ వాస్తవాన్ని అంగీకరిస్తారు. ఏదియెలాగున్నా, దేవుని అభిషిక్తుడు తన భౌతిక జీవితాన్ని మన పాపముల కొరకు సిలువలో అర్పించుకున్నాడనేది క్రీస్తు సువార్త యొక్క సత్యమైయుంది (1 కొరింథీ. 15:3).

పాప మానవులకొరకు దేవుని కుమారుడు సిలువపై మరణించాడు లేక బలియ య్యాడన్నది బైబిలు కథకు ప్రధానమైనది లేక గుండెవంటిదైయుంది. తన ప్రవచనాలతో అటు పాత నిబంధన, తన చారిత్రక వాస్తవాలతో యిటు క్రొత్త నిబంధన క్రీస్తు రక్తముతో తడుస్తూ ఉన్నాయి. ఆ కథలోని యేసును గూర్చిన చివరి మూడు దినాల చరిత్ర, సువార్త రచనల్లో ఒకటింటికి అయిదవవంతు ఉన్నట్టు హెన్రీ సి. థెయినస్ లెక్క వేశాడు. తన మరణంవలెనే, ప్రభువు యొక్క మూడున్నర సంవత్సరాల బహిరంగ సేవ వివరాలతో తీసికొన్నట్టయితే, సువార్త రచనల సందేశం 8,400 పేజీలవరకు సాగుతుందట.[1] క్రొత్త నిబంధనలోని ప్రతి 53 వచనాలలో, క్రీస్తు మరణానికి సంబంధించిన ఒక ప్రత్యేకమైన రిఫరెన్సు ఉన్నట్టు ఆర్. ఎ. టొర్రీ అంచనా వేశాడు.[2] దైవికమైన బలియర్పణ, ఆ బలి (అర్పణ) మృతులలోనుండి లేచుట అనేది కేంద్రముగా కలిగియున్న ఏకైక మతము లోకమంతటిలో క్రైస్తవ్యమొక్కటే.

లోకములోని పాపము, పాపులు; దోషారోపణ, భక్తిహీనత; ఎడబాటు, బాధ లేక వేదన అనేవాటినుండి రక్షించే దేవుని శక్తి సిలువయే; లోకముయొక్క కట్టకడపటి సమస్యకు దైవికమైన పరిష్కారం అదే! ఆయన మన పాపములకు శాంతికరమై యున్నాడు అంటే, మనం చేసే తప్పులను మనకొరకు ఒప్పులుగా చేయగలవాడు ఆయనే. “సిలువను గూర్చిన వార్త, నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు

దేవుని శక్తి" (1 కొరింథీ. 1:18). "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2).

ఆత్మసంబంధమైన మన పొందికలేమి, దేవునినుండి ఎడబాసిన స్థితి, దేవునితో ఐక్యతలేమి అనేవాటి మధ్య, సమాధానమునకును, శత్రువులు స్నేహితులగుటకును సిలువ దేవుని సాధనమైయుంది. "... ఆయన సిలువరక్తముచేత సంధిచేసి, ఆయనద్వారా సమస్తమును ... ఆయనద్వారా తనతో సమాధాన పరచుకొనవలెననియు తండ్రి అభీష్ట మాయెను" (కొలస్సీ. 1:20). "ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు" అని పౌలు వ్రాశాడు (ఎఫెసీ. 2:14-16).

ఆత్మసంబంధమైన ఆకలి, పేదరికం ఎక్కడ విస్తరించిందో, అక్కడ దేవుడు సంపూర్ణమైన విమోచనను ప్రసాదిస్తాడు. నీతి యొక్క ఐశ్వర్యము సిలువయొక్క అడుగు భాగమున ఉచితముగా యివ్వబడుతుంది. "మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము,..." అని పౌలన్నాడు (1 కొరింథీ. 1:23). ఆ సిలువవేయబడిన క్రీస్తే ".. .దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనమునాయెను" అని అతడు యింకను తెలిపాడు (1 కొరింథీ. 1:30).

క్రీస్తు సిలువకు కేంద్ర బిందువుగాను, బైబిలుయొక్క ముఖ్య సందేశముగాను ఉన్నట్టు దానిపై పరిశుద్ధాత్మ తన వెలుగును ప్రకాశింపజేస్తున్నది నిస్సందేహము.

విమోచన విషయములో సిలువ అనేక సత్యాలతో మిళితం చేయబడినందున, ఊటయొద్దనుండి కాలువ, సూర్యునియొద్దనుండి స్వస్థపరచు కిరణాలువలె సిలువ యొద్దనుండి సంఘము ప్రవహించాలి. క్రొత్త నిబంధనను శ్రద్ధగా చదివినట్లయితే, యిది వాస్తవమని తేలుతుంది. క్రీస్తు, ఆయన సంఘములేకుండ క్రైస్తవ్యము ఉండనొల్ల పడదు; శిరస్సులేకుండ సజీవమైన శరీరముండనేరదని తార్కికమైన ఆలోచన మనకు తెలియజేస్తుంది. నశించిన మానవునికి దేవుని బహుమానంగా సిలువ, సంఘము అనేవి సన్నిహితంగా కలిసిపోయి, ఒకే సంకల్పంగా ఏర్పడింది అనేది క్రొత్త నిబంధన

సందేశముయొక్క స్పష్టమైన గుణలక్షణమైయుంది. భూలోకము యొక్క సమస్త దేశ జనులలోనుండి సిలువద్వారా ఒక క్రొత్త కుటుంబాన్ని క్రీస్తునందు ఒకే జనమును (లేక శరీరమును) తన జనముగా స్వీకరించునట్లు దేవుడు పిలుచుచున్నాడు.

ఈ ఆలోచనను మనం యింకా ముందుకు కొనసాగించుదాం. సంఘము సిలువతో ఎలా కలుపబడింది? సిలువకు సంఘానికి ఒక దానితో నొకటి ఎట్టి సంబంధం కలిగియున్నాయి? సంఘం కొరకు సిలువ ఏమి చేస్తుంది?

## దానిచే సృజింపబడింది

మొదటిగా, సిలువ సంఘాన్ని సృజించుతుంది. పాపుల విమోచనము ద్వారా సంఘం పుట్టుకొస్తుంది. సిలువ లేకుండ ఉండియున్నట్టయితే, సంఘమే ఉండేది కాదు.

తన రక్షకుడని, దేవుని కుమారుడని విశ్వాసంతో కూడిన విధేయతతో ఒకడు క్రీస్తునకు లోబడినప్పుడు, క్రీస్తు రక్తమునందు అతడు తన పాపాలను కడుగుకొంటాడు (అపో. 22:16). అలా శుద్ధీకరింపబడుటనుబట్టి, విమోచింపబడిన సమాజానికిని, "సంఘము" అని క్రొత్త నిబంధన పిలిచే రక్షింపబడిన జనముతో అతడు చేర్చబడతాడు. ఈ కారణాన్నిబట్టి, ప్రభువు తన స్వరక్తమిచ్చి కొన్న లేక సంపాదించిన తన "సంఘము"ని పౌలు అనగలిగాడు. "దేవుడు (అనేక ప్రాచీన ప్రతులలో ప్రభువు) తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపో. 20:28). సంఘముకొరకు క్రీస్తు సిలువలో మృతినొందాడు. "క్రీస్తు సంఘమును ప్రేమించి దానికొరకు తన్ను తాను అప్పగించు కొనెను లేక అర్పించుకొనెను" అని పౌలు అన్నాడు (ఎఫెసీ. 5:25బి). లోకమందు క్రీస్తు ప్రభువుతో సహవాసము కలిగి, ఆత్మసంబంధమైన ఆయన పనికి తమ్మును తాము అప్పగించుకొని "పిలువబడిన" జనముగా జీవించేలా చేయడానికి క్రీస్తు మరణము ఉద్దేశింపబడింది. "ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" అని పౌలు తీతుకు తెలిపాడు (తీతు 2:14).

దక్షిణ ఆర్కన్‌సాస్‌లో ఒక సువార్త కూడిక ముగిసిన తరువాత చాలా మనస్సు కరిగించెడి కథతో ఒక స్త్రీ సువార్తికుని యొద్దకు వచ్చింది. తాను డల్లస్, టెక్సాస్‌లో

జీవించేటప్పుడు తన నాలుగు ఏండ్ల ప్రాయంలో జరిగిన సంఘటనను ఆమె చెప్పింది. అటుపిమ్మట తన కుటుంబము రద్దీగా ఉండే రహదారికి సమీపంలో నివసించిందట, బయట ఆడుకొనడానికి పిల్లలకు అక్కడ ఎక్కువ స్థలం లేకుండా పోయిందట. ఒక సాయంత్రపువేళ, తానును తనతో యిరుగుపొరుగు పిల్లలును వారి ఆవరణంలో బంతి ఆటాడుకుంటున్నారట. బంతి తన వద్దనుండి ఎగిరి రహదారిలోనికి వెళ్లిందట. ఆలోచన లేకుండగనే, ఆమె దానివెంట పరుగెత్తిందట. తాను వొంగి దాన్ని పట్టుకోబోయేసరికి ఒక ట్రక్కు ఆ రహదారిలో ఆమె మీదికి వస్తున్న దృశ్యాన్ని చూచి భయంతో ఆ పిల్ల స్తంభించిపోయిందట. ఆమె అన్న అప్పటికి తొమ్మిది ఏండ్లవాడు, ఆమె రహదారిలోనికి పరుగెత్తడం చూచాడట. అతడు ఆ ట్రక్కును కూడా చూచాడు. మెరుపులా వేగంతో, అతడు ఆమె వెనుకనే పరిగెత్తాడు, ఆమెను క్షేమంగా తీసికొని వద్దామనే ఆశతో, అతడు ట్రక్కు ముందుకు పరిగెత్తి దాని మార్గంనుండి ఆమెను గెంటాడు, తప్పని సరియైన చావునుండి తన సొంత యౌవన జీవితాన్ని యిరకాటంలో పెట్టుకొని ఆమెను తప్పించాడు. ఆ బాలుడు తన చెల్లిని కాపాడడానికి కొద్దిక్షణాలే సరిపోయాయి, కాని తన్ను తాను రక్షించుకొనడానికి అతనికి ఆ సమయం చాలలేదు.

ఆ విపత్తుయొక్క వివరాలు తనకు గుర్తులేవు, కాని ప్రాణం పోయిన తన అన్న యొక్క దేహాన్ని ఆ రహదారినుండి ఎలా ఎత్తికొని వచ్చి తమ యింటి వాకిటను ఆంబ్యూలెన్స్ వచ్చి తీసికొనిపోయేవరకు ఎలా పరుండబెట్టారో అది మాత్రం తనకు జ్ఞాపకముందట. "మా అన్న నాకొరకు చనిపోయాడు" అంటూ మాటల్లో వర్ణించలేని అభినందనతో గాఢమైన భావంతోను ఆమె చెప్పిందట. ఆమె ఒక నమ్మకమైన క్రైస్తవురాలు, అయితే ఆమె జీవితానికిని, నేడు సంఘంలో ఆమె చేసే పరిచర్యకు అవకాశము అనేక సంవత్సరాల క్రిందట తన అన్న అయిన బలినిబట్టి కలిగింది.

ఆ విధంగానే అయితే యింకా ఎక్కువ లోతైన మార్గంలో, సంఘము తన జీవితాన్ని క్రీస్తు ప్రభువు యొక్క బలినుండి పొందుతుంది. నిత్య జీవితానికి ఆయన బలి మనకు కేవలం ఒక అవకాశము మాత్రమేగాక; ఆయన మరణము మన (పాప) పరిహారమునకై బలియు, మన గత పాపముల క్షమాపణకు సాధనమునై యున్నది. ప్రభువైన యేసు ఈ లోకమునకవతరించి, మనమధ్య దేవ–మానవుడుగా సంచరించి, తన మరణముచేత, "దేవుని సొత్తయిన ప్రజలనుగా" ఆయన మనలను కొన్నాడు (1 పేతురు 2:9). సంఘమనేది ఇటుకలతోను అడుసుతోను నిర్మింపబడేది కాదు; అది రక్తంచేత కొనబడిన ప్రజలైయున్నారు.

క్రీస్తు ప్రభువు యొక్క బలియాగమునకు మనం మూడు విధాలుగా

ప్రత్యుత్తరమిస్తాం: మొదటిది, క్రీస్తు మన కొరకు జరిగించిన దానిని అభినందించుచూ మనం సిలువను కౌగలించుకుంటాం. క్రీస్తు ప్రభువు ప్రసాదించిన కృపావరమును బట్టి విమోచింపబడినవారు కృతజ్ఞతా పూర్వకంగా ఆనందిస్తారు! పరలోక మహిమయందు క్రీస్తు ఐశ్వర్యవంతులైయున్నారు; అయినా మన నిమిత్తము ఆయన పరలోకపు సౌభాగ్యాన్ని విడనాడి మానవ రూపుదాల్చి, మనము తన దారిద్ర్యము వలన ధనవంతులము కావలెనని మన నిమిత్తము ఆయన దరిద్రుడాయెను" (2 కొరింథీ. 8:9). రెండవది, ఆయన మరణము యొక్క ప్రయోజనాలను స్వీకరించుచూ, మనం ప్రతిస్పందించాలి. నిజమైన అభినందన తగిన అంగీకారానికి నడిపిస్తుంది. క్రీస్తునందలి విశ్వాసము విధేయతలద్వారా, ఆయన మరణము యొక్క ఫలితాలను మన జీవితంలోనికి మనం తీసికొంటాం. క్రీస్తునందలి విశ్వాసము విధేయతవలన, ఆయన మరణంవలన కలిగిన మేళ్లను మన జీవితాలలోనికి తీసికొంటాం (రోమా 6:1-4). ఆయన అందరికొరకు చనిపోయాడు (హెబ్రీ. 2:9), కాని తనకు విధేయులైన వారు మాత్రమే ఆయన మరణమువలన కలిగిన మేళ్లను అనుభవించగలరు (హెబ్రీ. 5:8, 9). మూడవది, విస్తరించు సేవతో మనము బలికి ప్రత్యుత్తరమియ్యాలి (1 కొరింథీ. 15:58). అరకాలినుండి నడినెత్తివరకు మనము ఆయనకు చెందినవారమైయుంటాం – శరీరము, ప్రాణము, ఆత్మయు ఆయనవే (1 కొరింథీ. 6:19, 20). అలాగుననే, ఆయన రూపించే, నడిపించే, ఆనందించే సేవయే నేడు ఈ లోకములో మన పనియైయుంది.

## దానిచే శుద్ధీకరింపబడింది

రెండవది, సిలువ సంఘాన్ని శుద్ధీకరిస్తూనే ఉంటుంది. దేవుని ప్రజలలో గుండా అనుదినం పవిత్రపరచగల దాని శక్తి ప్రవహిస్తునే ఉంటుంది. భౌతికమైన మన దేహాల్లోగుండా రక్తము ఎలా తప్పక ప్రచురిస్తుందో, శక్తి నొసంగుతూ ఎలా శుద్ధిచేస్తుందో అలాగే క్రీస్తు ప్రభువు యొక్క అమూల్యమైన జీవాన్ని నిలబెట్టే శక్తితో తన ప్రజలలో గుండా వెళ్లుతూ ఉంటుంది.

మనం రక్షింపబడుట మాత్రమేగాక, రక్షింపబడిన స్థితిలో మనం నిలబడవలసిన అవసరత ఉంది. క్రీస్తు సువార్తకు ఒక పాపి విధేయుడై, ఆయన రక్తముచేత కడుగబడి, దైవ కృపచే క్రీస్తులో పెట్టబడిన ప్రతిసారి సంఘము వృద్ధిచెందుతుంది. తాను అనుదినము వెలుగులో నడుస్తూ ఉండగా క్రైస్తవుడు ఆయన రక్తముచే కడుగబడుతునే ఉంటాడు. "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల,

మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" అని యోహాను వ్రాశాడు (1 యోహాను 1:7). "పవిత్రులనుగా చేయును" అని వర్తమాన క్రియా కాలంలో యోహాను గ్రీకు భాషలో పెట్టి, నిరంతరమైన లేక ఎడతెగని, కొనసాగింపబడే, వర్తమానపు కడిగే వాస్తవంగా సూచించాడు.

క్రైస్తవుడు పరిపూర్ణుడైన వ్యక్తి కాడు. అతడు పాపములేని జీవితాన్ని వెదకుతూ, అనుదినము క్రీస్తునందు ఎదుగుతున్నవాడైనా, తప్పులేనివాడు కాడు, గాని అతడు నిర్దోషియై యుండాలి. పాపియొక్క జీవితంలోని పాపాపు ఉనికి క్రీస్తు రక్తము ద్వారా రక్షణయొక్క ఆవశ్యకతను కలిగియుంటుంది, మరియు పరిశుద్ధుని జీవితంలోని పాపము, క్రీస్తు రక్తముచే రక్షణలో నిలబెట్టవలసిన అవసరత కలిగియుంటుంది. లోకంలో జీవించినంత కాలము పాపక్షమాపణ రూపొందవలసిన అవసరత లేనివారైయుండము.

పసివాడు సైకిలు తొక్కడం నేర్చుకొనేటప్పుడు చూడడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ క్రొత్త నైపుణ్యాన్ని అతడు చేజిక్కించుకొనడంలో రెండు ప్రాథమిక సమస్యలను ఎదుర్కొంటాడు: సైకిలిని ఎత్తి నిలబెట్టడం, నిలబెట్టిన పాటున ఉంచడం. సైకిలు తొక్కడం నేర్చుకొనడంలో ఉన్నట్టే రక్షణలో కూడా రెండు మెట్లు ఉన్నట్టు చూడవచ్చు: మొదటిగా పాపి దేవునితో సరిగా నిలబడాలి లేక సరియైన సంబంధానికి పునరుద్ధరించ బడాలి, అటు తరువాత అతడు ఆయనతో సరిగా నిలిచియుండాలి లేదా బాంధవ్యాన్ని కొనసాగించుకోవాలి. సరికావడం అవసరమే, కాని అది ఆరంభము మాత్రమే. మొదటిగా అతన్ని పాపిగా చేసింది ఆ సమస్యయే. జీవితంలో పాపాపు మరక అతడు క్రైస్తవుడైన తరువాత ఎల్లప్పుడును కడుగబడకుంటే అదే సమస్య శిక్షావిధికి పాత్రుడయ్యేలా చేయవచ్చు (అపొ. 8:22). క్రైస్తవుడు కాకముందు తన పాపములనుండి రక్షింపబడడం అతనికి అవసరమైయున్నట్టయితే, తాను క్రైస్తవుడైన తరువాత చేసిన ఏ పాపమునుండి యైన రక్షణ అతనికి అవసరముండదా?

తాను "వెలుగులో నడుస్తున్నంత కాలము" క్రైస్తవుడు రక్షింపబడిన స్థితిలో నిలిచియుంటాడు. అపొస్తలుడైన యోహాను ప్రకారము, వెలుగులో ఆత్మ సంబంధమైన రెండు విశేష గుణములు కావలసియుంటుంది. రక్షణకొరకు ప్రభువైన యేసునందు నమ్మికయుంచడంతో అది ఆరంభమౌతుంది: "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2). వాస్తవంగా మన రక్షణను మనం సంపాదించుకోలేం (ఎఫెసీ. 2:8, 9). ఆయనయందు

విశ్వాసముతోను విధేయతతోను మనం ప్రత్యుత్తరం యిచ్చినట్లయితే మనలను రక్షిస్తానని ప్రభువైన యేసు అన్నాడు. తాను ఏమి చేస్తానని చెప్పాడో దానిని ఆయన మనకు చేసేలా మనమాయనయందు నమ్మికయుంచాలి. మనం విశ్వాసంతోనేగాని వెలిచూపుతో నడువ కూడదు (2 కొరింథీ. 5:7).

వెలుగులో నడవడంలో ఆయన చిత్తాన్ని యథార్థంగా చేయవలసియుంటుంది. "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట ..." యని యోహాను వ్రాశాడు (1 యోహాను 5:3). "ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు; వానిలో సత్యము లేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను" (1 యోహాను 2:4, 5ఎ). వెలుగులో నడవడమంటే, మన పాపములను మనం అంగీకరించడం (1 యోహాను 1:8, 10), దేవుని ఎదుట మన పాపములను మనం ఒప్పుకొనడం (1 యోహాను 1:9), మరియు మన పాపములను మన సామర్థ్యము మేరకు దిద్దుకొనడం (1 యోహాను 2:29). దాని భావం, ఆయన నడిచినట్టు మనం నడవడం (1 యోహాను 2:6) మరియు దేవుని యొద్దనుండి ప్రేరేపింపబడిన లేఖనాలను యథార్థ హృదయంతో అనుసరించడమునైయుంది (2 తిమోతి 3:16).

## దానిచే బలవంత పెట్టబడింది

మూడవది, సిలువ బలవంత పెట్టి సంఘాన్ని పనిలో దించుతుంది. క్రీస్తు కోరిన వ్యక్తులుగాను ఆయన కోరిన దానిని చేసే పని వారినిగాను ఆత్మసంబంధమైన ఉద్దేశాలను సంఘము యొక్క హృదయంలో అది నాటింపజేస్తుంది.

క్రైస్తవులకు కొనసాగుతున్న శుద్ధీకరణతో పాటు వ్యక్తిగతమైన శక్తి అవసరమై యుంటుంది. అనేక గంభీరమైన ఉద్దేశాలను క్రైస్తవ్యం ప్రసాదిస్తుంది; దేవుని కృప అత్యున్నతమైనదియు బహు స్థిరమైనదియునైయున్నది. "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని" ప్రభువైన యేసు అన్నాడు (యోహాను 12:32). పౌలు యిలా వ్రాశాడు: "క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది; ఏలాగనగా అందరికొరకు ఒకడు మృతిపొందెను గనుక అందరును మృతిపొందిరనియు, జీవించువారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందె ననియు నిశ్చయించుకొనుచున్నాము" (2 కొరింథీ. 5:14, 15).

దేవుని పట్లను ఒకరి పట్ల ఒకరికిని ఎక్కువైన ప్రేమ కలిగియుండునట్లు సిలువ

క్రైస్తవులను నింపుతుంది. “ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము” అని యోహాను వ్రాశాడు (1 యోహాను 4:19). తన ప్రజల పట్ల ఆయన ప్రేమను క్రైస్తవులు అనుదినము ధ్యానము చేస్తుండగా, ఆయనను ఎక్కువగా ప్రేమించుటకు ఆకర్షింపబడుతున్నారు. యోహాను యింకా యిలా అన్నాడు, “ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొను చున్నాము. మనముకూడా సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము” (1 యోహాను 3:16). ప్రభువైన యేసు జీవితాన్ని తిరిగి ఎక్కడ మనం చూచినా, ఆయన ప్రేమయొక్క లోతు, నిలకడలతో క్రొత్తగా ఉత్తేజపరచే పటాలు ఉత్పన్నమౌతాయి. ఈ పటాలను గూర్చి ఆలోచన చేస్తుంటే, ప్రభువు కొరకును, ఒకరి యెడల ఒకరికిని అలాటి ప్రేమయే యివ్వబడుతుంది: “మన మందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము” (2 కొరింథీ. 3:18).

క్రైస్తవుని జీవితంలో పాపంపట్ల ద్వేషమును, అయిష్టతను సిలువ స్థాపిస్తుంది లేక నాటుతుంది. దుష్టత్వానికి పాడుచేసే పాపానికి సాక్షాధారములు కల్వరి సిలువ మరియు నిత్యనాశనమునకు సంబంధించిన అగాధము అనేవి. సిలువకు కారణాన్నిగాని నరకముయొక్క అవసరతనుగాని ఎరిగిన ఎవడును పాపం చేయడంవలన ఏవైనా మేళ్లు ఉన్నాయని వాదించడు. యెరూషలేము గవినికి వెలుపల దేవుని కుమారుడు అనుభవించిన వేదనకరమైన మరణమువలన తన విమోచన సంపాదించబడిందని దేవుని బిడ్డ మరువలేడు. సర్వశక్తుడగు దేవుడు పాపముకొరకైన ఋణాన్ని తన కుమారుని బలి ద్వారానే చెల్లించాడు. ఈ మహా విలువైన సంఘటన బుద్ధిగల ప్రతి వ్యక్తి పాపమును అసహ్యించుకొని దానిని విసర్జించేలా చేస్తుంది.

క్రీస్తు యొక్క పనికి తమ్మును తాము సంపూర్ణంగా సమర్పించుకొనేలా క్రైస్తవులను సిలువ బలవంతము చేస్తుంది. దేవుని సేవించడానికిని, యితర జనులకు సహాయం చేయడానికిని కారణాన్ని, బలాన్ని కూడా క్రైస్తవులకు అది ప్రసాదిస్తుంది. “గ్రీసు దేశస్థులకును గ్రీసుదేశస్థులు కానివారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను” (రోమా 1:14) అని పౌలు అన్నాడు. మరియు, “అయినను నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని, వారందరికంటె నేనెక్కువగా ప్రయాసపడితిని. ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే”

(1 కొరింథీ. 15:10). దేవుడు సిలువ యొద్ద తనకొరకు ఏమి జరిగించాడో దానిని గ్రహించి అభినందించగలిగిన దానికంటే ఎక్కువగా ఏ క్రైస్తవుడును క్రీస్తు ప్రభువు యొక్క పనిని సంపూర్ణంగా చేయడానికి ఉద్దేశం కలిగింపబడదు.

క్రీస్తు సంఘము తన ప్రభువు ఆజ్ఞలను జాగరూకతతో అనుసరిస్తుంది. ఆమె ఆయన కోర్కెలను జరిగిస్తుంది, ఆయన సంకల్పాలను నెరవేర్చుతుంది, కాని విధేయతతో కూడిన తన జీవితం భారభరితంగా ఆమె ఎంచుకోదు ఎందుకంటె బలవంతం చేసే ప్రేమయొక్క శక్తి, ఆయన కృపయొక్క అంతరంగ ప్రేరేపణ ఆమె కలిగియుంటుంది. "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహాను 5:3).

క్రీస్తు నీ కొరకు ఏమి చేశాడో అది మనస్సులో ఉంచుకో, ఆయన నీ కొరకు చేసిన ఆ త్యాగాన్ని జ్ఞాపకం చేసికొంటూ ఉండు. ఆయన కృపా రాజ్యములో ప్రేమతో కూడిన ప్రయాసలతో పని చేసేలా నిన్ను నడిపించుతుంది, రక్షణయను ఆయన బహుమానాన్ని జాగ్రత్తగా ఆలోచించడంవలన అనుదినము ఆయన రూపులోనికి మార్చబడేలా చేస్తుంది.

## ముగింపు

దేవుని నమూనాచే సంఘము, సిలువ అనేవి ఏకముగా బంధింపబడ్డాయి. సిలువచే సంఘము సృజింపబడింది, పరిశుద్ధపరచబడింది, బలవంత పెట్టబడింది.

సిలువపై ప్రభువైన యేసు శ్రమ అనుభవించుతూ ఉండగా, దాని క్రింద భాగములో నిలిచియున్న దుష్టులచే విసరి వేయబడిన రెండు పరిహాసపు ప్రశ్నలేవంటే– "ఆయన" తన్ను తాను ఎందుకు రక్షించుకొనలేదు? మరియు, "దేవుడు ఆయనను ఎందుకు రక్షించడు?" అనేవి (మత్తయి 27:39–43 చూడు). దేవుని పనియొక్క పునాదులపైననే వారు కొట్టుతున్నారన్న విషయం ఆ గుంపు గుర్తించలేకపోయింది. ప్రభువైన యేసు తన్ను తాను రక్షించుకొనగలిగినా లేక దేవుడే సిలువ మరణంనుండి ఆయనను విడిపించియున్నా, సంఘము జీవించడం అసాధ్యమైయుండేదే; ఎందుకంటే– సిలువ (మరణం) చేత తమ గత పాపములు క్షమింపబడిన జనులచే సంఘము నిర్మింపబడినదై, అందున్న జనులు సిలువ రక్తముచే అనుదినము కడుగబడి శుద్ధీకరింపబడుచున్నారు. పైగా, సిలువ లేకుండ, ముందుకు వెళ్లే తన సంఘ జీవితం అంతరంగపు ప్రోద్భలంలేనిదైయుంటుంది. ఏలాగంటే, సంఘము దేవుని ప్రజలుగా ఉండునట్లును, దేవుని పని దైవ విధానంలో జరిగించునట్లును సిలువ ప్రేమచే బలవంత పెట్టుతుంది.

నీవు క్రీస్తు సంఘమునకు వెలుపట ఉన్నట్లయితే, దానిలో ప్రవేశించడానికి త్వరపడు, ఎందుకంటే సంఘంలో ప్రవేశించుటలో, సిలువయొక్క ఫలితాలన్నిటిని నీవు పొంద గలవు. క్రీస్తు రక్తముచే విమోచింపబడి, దేవుని పిల్లలుగా జీవించే జనుల సముదాయాన్ని మించి సంఘమనేది ఏదీలేదు.

ఈ లోకములోని ప్రతివ్యక్తియు దేవుని యొక్క ఉదారమైన ఈవులతో ఆవరింప బడియున్నాడు. మనం పీల్చుకొనడానికి గాలి, మనం త్రాగడానికి నీళ్లు, మనం నివసించడానికి భూమి, మనం అనుభవించడానికి కుటుంబ బాంధవ్యాలు, యింకా లెక్కలేనన్ని అనేక యితరమైనవి ఉన్నాయి. దేవుడు మనకు ప్రసాదించే ఈవులనన్నిటిని పేరుపెట్టి చెప్పగోరేవాడు అలా చేయలేకపోతాడు. నిస్సందేహంగా, క్రీస్తుద్వారా ఆయన మనకు ప్రసాదించే రక్షణ ఆయన కృపను వ్యక్తపరచుటలో అతి శ్రేష్ఠమైనది. అది దేవునికి ఎంతో ఖరీదైనదిగాను, దాన్ని స్వీకరించిన పాపులకు అధిక రాబడులు ప్రసాదించేదిగాను ఉంది.

దేవుని కృపాహస్తము తమకు ప్రసాదించుతున్న భౌతికమైన దీవెనలను అనేకులు చూడగలుగుతున్నారుగాని, ఆయన దయచేస్తున్న రక్షణను వారు అందుకోలేక పోతున్నారు. ఇది నీ విషయములో సత్యమా? క్రీస్తునందలి విశ్వాసము (రోమా 10:10), పాపముల విషయమైన మారుమనస్సు (అపో. 11:18), యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనడం (రోమా 10:10), క్రీస్తులోనికి బాప్తిస్మంద్వారా (గలతీ. 3:27) క్రీస్తు శరీరములోనికి (1 కొరింథీ. 12:13), కృపలోనికి నీవు ప్రవేశించి ఆయన నిత్యజీవాన్ని పొందవచ్చు. “క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?” అని పౌలు అన్నాడు (రోమా 6:3), “దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది” (ఎఫెసీ. 1:7).

తన సిలువ ద్వారా, ప్రభువైన యేసు పాపక్షమాపణ కొరకును, సంఘము అనే తన శరీరాన్ని సృజించే జీవంలోనికి నిన్ను ఆహ్వానిస్తున్నాడు. ఆయన ఆహ్వానాన్ని నీవు అంగీకరిస్తావా?

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 251వ పేజీలో*)

1. బైబిలు కథకు ప్రధానమైయున్నదేది?
2. ఇతర ఏ మతాలకు లేనిది, క్రైస్తవ్యానికి మాత్రమే కేంద్ర స్థానములో ఉన్నదేమి?
3. సంఘములేని క్రైస్తవ్యం ఎందుకు ఉండకూడదో వివరించు.
4. సంఘం కొరకు సిలువ జరిగించిన మూడు కార్యాలేవి?
5. భౌతిక సంబంధమైన దీవెనలతో అనేకులు దేవుని కరుణాహస్తాన్ని చూడగలిగారు కాని రక్షణయనే ఆయన ఈవిని వారు పొందలేదు. క్రీసు శరీరమందు నీవు ఎలా ప్రవేశింపగలవు?
6. ప్రభువైన యేసు, తన సిలువ ద్వారా, ఏ రెండు దీవెనలు పొందడానికి నిన్ను అహ్వానిస్తున్నాడు?
7. తన యొద్దకు వచ్చినవారు పాప క్షమాపణను, జీవమును పొందినప్పుడు క్రీస్తు యొక్క శరీరము సృజింపబడింది. ఈ శరీరాన్ని ఏమని పిలిచారు?

## పద సహాయకారి

**సంఘమునకు శిరస్సు –** యేసుక్రీస్తు (ఎఫెసీ. 1:22, 23).

**కొన్నాడు –** క్రైస్తవులు క్రీస్తు రక్తముచే కొనబడ్డారని మనం అన్నప్పుడు, ప్రభువైన యేసు మన పాపముల కొరకు సిలువపై మరణించాడు అని సూచిస్తుంది.

**సంధి చేయుట –** తిరిగి ఏకముగా తెచ్చుట, విడిపోయిన బాంధవ్యాన్ని కలుపుట, మనం క్రీస్తుయేసు ద్వారా దేవునితో సంధి చేయబడితిమి.

**రూపాంతరము చెందుట –** మారిపోవుట, ప్రభువైన యేసుయొక్క స్వరూపానికి మార్చబడేలా క్రైస్తవుడు నూతనమైన శీలాన్ని లేక గుణగణాలను అలవరచుకోవాలి. రోమా 12:2 యిలా అంటుంది, "మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి."

---

[1]Henry C. Thiessen, *Lectures in Systematic Theology* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1949), 313. [2]R.A. Torrey, *What the Bible Teaches* (New York: Fleming H. Revell Co., 1898), 144.